క్లుప్తంగా

ముగిసిన ధార్మిక కార్యక్రమాలు

రుద్రవరం: మండలంలోని ముకుందాపురం రామాలయంలో వారం క్రితం తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో చేపట్టిన ధార్మిక కార్యక్రమాలు ముగిశాయని కార్యనిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి తెలిపారు. వారం రోజుల పాటు ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజున గో పూజ, కుంకుమార్చన వంటి కార్యక్రమాలు చేపట్టారు. సర్పంచు గుండా వరలక్ష్మి, ధర్మ ప్రచార మండలి సభ్యులు వీరాంజనేయరావు, సుబ్బరాయుడు, నరసింహుడు ఉన్నారు.

వాహనాల వేలం

శిరివెళ్ల: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వేలం పాటలు నిర్వహించారు. 14 ద్విచక్రవాహనాలు, స్కార్పియో, ఇన్నోవాకు బహిరంగ వేలం చేపట్టారు.13 మంది డిపాజిట్లు చెల్లించి వేలంలో పాల్గొన్నారు. వేలం ద్వారా ప్రభుత్వానికి జీఎస్టీతో కలిపి రూ.1.64 లక్షలు ఆదాయం లభించింది. స్కార్పియో రూ.48 వేలు, ఇన్నోవా రూ. 28,500కు దక్కించుకున్నారు. ఎస్‌ఐ సురేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగుగంగ కాల్వకు గండి



గుట్టకొండ స్వామి ఆలయం సమీపంలో కట్టకు గండి పడిన దృశ్యం

రుద్రవరం: మండల కేంద్రం సమీపంలోనున్న గుట్టకొండ నరసింహస్వామి ఆలయం వద్ద తెలుగుగంగ 21వ బ్లాక్ ఉప ప్రధాన కాల్వ కట్టకు గండి పడింది. కాల్వకు పక్కనే ఉన్న మరో పంట కాల్వ ద్వారా దిగువ ఆయకట్టుకు నీరు పారుతుండేది. అయితే ఉప ప్రధాన కాల్వ కట్టకు గండి పడటంతో సాగు నీరు దిగవకు పారకుండా కాల్వలోనే కలిసి పోతోంది. అధికారులు స్పందించి గండి పూడ్చాలని రైతులు కోరుతున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దాత

రుద్రవరం: మండలంలోని వాసాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో బాలాలయం నిర్మాణానికి శనివారం ఆళ్లగడ్డకు చెందిన డాక్టర్ వెన్నపూస కేశవరెడ్డి, సుచిత్ర దంపతులు రూ.లక్ష విరాళాన్ని ఆలయ నిర్వాహకులు మధుసూదన్‌రెడ్డి, రంగనాయకులు, నరసింహులుకు అందజేశారు. ఆలయానికి వచ్చిన వారికి నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

జిల్లాస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



రెజ్లింగ్ పోటీలో తలపడుతున్న బాలికలు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి స్కూల్‌గేమ్ ఫెడరేషన్ పోటీలను ఇన్‌చార్జ్ డీఈఓ మహబూబ్‌బేగ్ ప్రారంభించారు. శనివారం జరిగిన పోటీలో ఆయన మాట్లాడుతూ రెజ్లింగ్ పోటీలో జిల్లాకు మంచిపేరు తీసుకురావాలన్నారు. నంద్యాల జిల్లా స్కూల్‌గేమ్ ఫెడరేషన్ సెక్రటరీ శ్రీనాథ్ ఆధ్వర్యంలో నంద్యాల, కర్నూలు జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు, 40 మంది వ్యాయామ ఉపాధ్యాయులు ఎంపిక పోటీలకు హాజరయ్యారు. అండర్-14,17 విభాగాల్లో 35 మంది బాలబాలికలు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శ్రీనాథ్, ఏపీ సీఎం కప్ కో ఆర్డినేటర్ ఏపీ రెడ్డి తెలిపారు.

విద్యుద్దీకరణలో జాగ్రత్త..

నంద్యాల(అర్బన్): పట్టణ, గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న గణేష్ విగ్రహాల విద్యుద్దీకరణలో నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఈఈ రమణారెడ్డి తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ విగ్రహం ఏర్పాటు చేస్తున్న ప్రాంతాలను గుర్తించి ఇప్పటికే విద్యుత్ తీగలను సరి చేశామన్నారు. విద్యుత్ సరఫరాను దృష్టిలో ఉంచుకొని కొత్త వైర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిర్వాహకులు నామినల్‌గా మీసేవ కేంద్రాల్లో డబ్బులు చెల్లించి రసీదులు తీసుకోవాలన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

ఆళ్లగడ్డ: ఆవోపా ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆవోపా సభ్యులు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేసేందుకు 150 ప్లేట్లు అందజేశారు. హెచ్‌ఎం మురళీధర్, డాక్టర్ ఏవీ రామసుబ్రహ్మణ్యం, డాక్టర్ ప్రభాకర్, జనార్దన్ ఉన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆళ్లగడ్డ పట్టణ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. సీఐ రమేష్ బాబు తెలిపిన వివరాల మేరకు.. గొస్పాడు మండలం, నాగులవరం గ్రామానికి చెందిన అన్వర్‌తో పాటు ఇద్దరు కలిసి లారీలో 16 టన్నుల రేషన్ తరలిస్తున్నారనే సమాచారం మేరకు పట్టణ శివారులోని అహోబిలం బైపాస్ రోడ్డులో దాడి చేసి పట్టుకున్నట్లు చెప్పారు. ముగ్గురిని అరెస్టు చేశామని పేర్కొన్నారు.

వద్దన్నా వినరే..

- ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలంటున్న అధికారులు
- వర్షాభావం నేపథ్యంలో సూచన
- అయినా చెరువుల కింద వరి పంట సాగు చేస్తున్న రైతులు
- చెరువుల్లో అరకొరగా నీటి నిల్వలు

మండలంలో..

సాధారణ సాగు విస్తీర్ణం : 16వేల ఎకరాలు
వరి సాధారణ సాగు విస్తీర్ణం : 8వేల ఎకరాలు
ఈ ఏడాది ఇప్పటికే వరి సాగైంది : దాదాపు 5వేల ఎకరాలు
నాటుకు సిద్ధంగా ఉన్నవి, నాట్లు వేస్తున్నవి : 1,500 ఎకరాలు
సెంటు నార : రూ.1,800 (ఎకరాకు రెండు సెంట్ల నారు సరిపోతుంది)
పొలాలు సిద్ధం చేయడం, మందులు, ఎరువులు, కూలీలు, నారు తదితర ఖర్చులతో ఎకరాలో పంట సాగుకు రూ.20 వేల వరకు అవుతుంది.
ముందస్తు ఖరీఫ్‌లో భాగంగా సాగైన పంటలు..
మినుము 1,485 ఎకరాలు
మొక్కజొన్న 6వేల ఎకరాలు
మిరప 2వేల ఎకరాలకు పైగా..

రుద్రవరం: ఖరీఫ్‌లో భాగంగా ఈ ఏడాది ఈనెల ప్రారంభంలో కురిసిన వర్షాలే భారీవి. ఇక ఇప్పటి వరకు సరైన వర్షాలు కురవలేదు. అలాగే సీజన్ ప్రారంభం నుంచి అరకొరగా కురుస్తున్న వర్షాలకు ముందుస్తుగా మొక్కజొన్న, మినుము, మిరప పంటలు సాగు చేశారు. మిరప అరకొరగా చేతికొచ్చినా.. మినుము, మొక్కజొన్న కొంతమేర దిగుబడి తగ్గాయి. ప్రస్తుతం వాటి కోతలు జోరుగా సాగుతున్నాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జలాశయాల్లో సరిపడ నీటి నిల్వలు లేకపోవడం, ఎగువ ప్రాంతాల్లోనూ వర్షాలు కురవకపోవడంతో తుంగభద్ర డ్యాంలో ఆశించిన మేర నీటి నిల్వ లేకపోవడంతో.. అన్నదాతలు నష్టపోరాదని.. ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని అధికారులు సూచించారు. దీంతో వరి పంట సాగు తగ్గుతుందని భావించారు. ముందస్తు ఖరీఫ్‌లో భాగంగా సాగు చేసిన మినుము, మొక్కజొన్న, మిరప తదితర పంటలు వాడుముఖం పట్టడంతో తొలివిడతలో భాగంగా తెలుగు గంగ కాలువకు పది రోజుల పాటు నీరు విడుదల చేశారు. పదిహేను రోజుల విరామం అనంతరం రెండు రోజుల క్రితం మళ్లీ రెండో విడత నీరు విడుదల చేశారు. ఈ నీటిని అవసరాలు, తాగునీటి కోసం చెరువులకు మళ్లించారు. దీంతో రైతుల్లో ఆశలు పెరిగాయి. అధికారుల అనుమతులు లేకుండా చెరువుల షట్టర్లు ఎత్తివేసి సొంతంగా నీటిని విడుదల చేసుకుని వరినాట్లకు పూనుకున్నారు. నాట్లు పూర్తయిన ప్రాంతాల్లో నీటి విడుదలను నిలిపివేయకపోవడంతో చెరువుల్లోని నీరు వృథాగా పారిపోతోంది. వరి నారు వేసుకోకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి సెంటు నార రూ.1,800 ప్రకారం కొనుగోలు చేసి తెచ్చుకొని మరీ నాట్లు వేస్తున్నారు. పంట సాగుకు ఆతృత పెరిగిపోవడంతో కొండమాయపల్లె చెరువు షట్టరు తొలగించి విసిరివేయడంతో చెరువు నీరు వృథాగా పారిపోతోంది. చెరువుల్లోని నీటిని నమ్ముకొని పంటలు సాగు చేయొద్దని, ఆ నీటిని కేవలం అవసరాలు, తాగునీటి కోసం విడుదల చేశామని, పంటలకు ఇవ్వలేమని చెబుతున్నా రైతులు లెక్కచేయకుండా నాట్లు కొనసాగిస్తున్నారు.



నాట్లు వేస్తున్న కూలీలు



రంగారెడ్డి చెరువులో అరకొరగా నీరున్న దృశ్యం



ఆర్.కొత్తూరు వద్ద వరి నారు సిద్ధం చేస్తున్న కూలీలు

కొనసాగుతున్న కొత్త పింఛన్ల పంపిణీ

శిరివెళ్ల: మండలంలో వైఎస్సార్ పింఛన్ కానుక కింద మంజూరైన కొత్త పింఛన్ల పంపిణీ కొనసాగుతోంది. గోవిందపల్లె, మహదేవపురం, కోటపాడు, జీనేపల్లె, కోటపాడు సర్పంచులు మరియమ్మ, దూదేకుల ఉశేనిబీ, పెద్ది రమణయ్య, రఘునాథరెడ్డి, మందాల రాధిక, గుండంపాడులో ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు. మండలానికి ఈ నెలలో రెండు విడతలుగా 345 కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డి, వంకదార సుబ్బసత్యనారాయణశ్రేష్ఠి, ఉప సర్పంచు ఇందూరి శేషారెడ్డి పాల్గొన్నారు.

మట్టి వినాయకుడినే పూజిద్దాం

నంద్యాల (సిటీ): పట్టణంలో ప్రతి ఒక్కరూ మట్టి వినాయకున్ని పూజించి కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా అన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో మున్సిపల్ సిబ్బందికి మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మట్టి వినాయకుడి ప్రతిమలను అందజేశారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

దొర్నిపాడు: పత్తి పంటలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి సునీత సూచించారు. శనివారం దొర్నిపాడులో పొలంబడి నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పంటకు బెట్ట పరిస్థితుల్లో తీసుకోవల్సిన పద్ధతులు వివరించారు. అనంతరం డబ్ల్యూకొత్తపల్లెలో ఆర్బీకేను తనిఖీ చేశారు.

రూ.3.5 కోట్లతో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



రుద్రవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పనులు చేస్తున్న దృశ్యం



రుద్రవరానికి చేరిన మెగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్

రుద్రవరం: మండల కేంద్రంతో పాటు ఆలమూరు విద్యుత్ సబ్ స్టేషన్లలో దాదాపు రూ.3.5 కోట్లతో అదనపు మెగా పవర్ ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు ఆ శాఖ ఏఈ రాఘవేంద్రారెడ్డి తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో శనివారం మరమ్మతు పనులు చేపట్టారు. ఏఈ మాట్లాడుతూ..ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు పంటలకు నీరు పారించుకునేందుకు అధికంగా బోరు మోటార్లను వినియోగించారు. దాదాదాపు తొమ్మిది వేల బోరు మోటార్లు ఒకే సారి పని చేయడంతో అక్కడక్కడ లో ఓల్టేజీ సమస్య తలెత్తింది. రాబోయే రోజుల్లో ఆ సమస్య తలెత్తకుండా ఉండేందుకు రుద్రవరం, ఆలమూరు సబ్ స్టేషన్లలో అదనంగా మరో 8 మెగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ చొప్పున ఏర్పాటు చేయాలని నిర్ణయించి పనులు చేపట్టామన్నారు. ఇందులో భాగంగానే ప్రత్యేకంగా దిమ్మె నిర్మించారు. కాగా మెగా పవర్ ట్రాన్స్‌ఫ్మార్మర్లు సబ్‌స్టేషన్లకు చేరుకున్నాయి. నాలుగైదు రోజుల్లో పనులు పూర్తవుతాయని, అప్పుడు రైతులకు ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిరంతరాయంగా తొమ్మిది గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని చెప్పారు. పనులను ఏడీఈ రవికాంత్ చౌదరి పరిశీలించారు.

జగనన్నతోనే పేదరిక నిర్మూలన

ఉయ్యాలవాడ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదరిక నిర్మూలన సాధ్యమని, ఇందులో భాగంగా ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని హరివరం గ్రామంలో రాష్ట్ర ఐడీసీ చైర్మన్ కర్రా గిరిజారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, సర్పంచ్ నడిపెన్న, ఉప సర్పంచ్ ఎర్రి శ్రీనివాసరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు పల్లె మహేశ్వరరెడ్డి, గ్రామ నాయకులు తరిగోపుల ప్రసాద్‌రెడ్డి, ఎర్ర వెంకటస్వామి రెడ్డిలతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. వారు ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందజేశారు. గ్రామంలో 917 కుటుంబాల్లోని 1,712 మందికి వివిధ రకాల పథకాల ద్వారా రూ.8,86,39,000 వారి వ్యక్తిగత ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందని వివరించారు. సంక్షేమ పథకాలు అమలవుతున్న తీరుతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని, జగనన్నకు ఆదరణ పెరుగుతుండటంతో భరించలేని ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయన్నారు. టీడీపీ హయాంలో పథకాలు వర్తించాలంటే జన్మభూమి కమిటీల సిఫారసు వుండేదని, ప్రస్తుతం కేవలం అర్హత ఉంటే చాలన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు కసాని పుణ్యలక్ష్మిదేవి, ఎంపీటీసీ సభ్యులు పెద్ద పేరయ్య, బాలిరెడ్డి, సర్పంచ్‌లు గురుప్రసాద్‌రెడ్డి, మద్దిలేటిరెడ్డి, నాయకులు ఆరికట్ల శివరామకృష్ణారెడ్డి, దండేలా ఆదినారాయణరెడ్డి, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



హరివరంలో మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల, చిత్రంలో ఎంపీ పోచా

ఆలయానికి విరాళాలు

శిరివెళ్ల: నల్లమల అటవీ ప్రాంతంలోని శ్రీ సర్వ నరసింహస్వామి ఆలయానికి శనివారం విరాళం అందజేశారు. భక్తుల తాగునీటి కోసం రూ. 25 వేలు విలువజేసే కూల్ వాటర్ పరికరం, రూ.30 వేల విలువజేసే మినరల్ వాటర్ పరికరం, రూ.10వేల విలువజేసే వెయ్యి లీటర్ల ట్యాంక్‌ను గుండంపాడుకు చెందిన నుసి నాగిరెడ్డి తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అందచేశారు.

సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని పీఆర్‌టీయూ నంద్యాల జిల్లా గౌరవాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి కోరారు. శనివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..అంతర్ జిల్లా బదిలీలు చేపట్టాలని, క్యాడర్ స్ట్రెంగ్త్ సమస్యను పరిష్కరించాలని, పెండింగ్ బకాయిలను ఇవ్వాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద జీతాలు చెల్లించాలని, కేజీబీవీ ఉపాధ్యాయులకు ఎంటీఎస్ అమలు చేసి అరియర్స్ ఇవ్వాలన్నారు. కృష్ణారావు, విజయరావు, సుమయాన్, జగదీష్, నరసింహులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో టీటీడీ రోడ్డులో బీజేపీ కార్యాలయాన్ని శనివారం ఆపార్టీ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ బైరెడ్డి శబరి ప్రారంభించారు. విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో పార్టీని బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నర్సింగరావు, శివారెడ్డి, బ్రహ్మయ్య ఆచారి పాల్గొన్నారు.

ఇంటింటా సర్వే

గోస్పాడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఒంటివెలగల గ్రామంలో వైద్యాధికారి గోపాల్ ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

బీమా తక్షణ సాయం అందజేత

నంద్యాల (సిటీ): పట్టణంలోని 21వ వార్డు నూనెపల్లెలో కొంగలి అలిసమ్మ శనివారం మృతి చెందారు. మృతురాలు వైఎస్సార్ బీమా అర్హురాలు కావడంతో నామినీగా ఉన్న భర్త రవికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10వేలను వార్డు ఇన్‌చార్జ్ అనిల్ అమృతరాజ్, సచివాలయ అడ్మిన్ నారాయణ, గురుస్వామి, వలంటీర్ ప్రదీప్ అందజేశారు.

హామీలన్నీ నెరవేర్చి గడప గడపకు వెళ్తున్నాం

నంద్యాల (సిటీ): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ 98 శాతానికి పైగా అమలు చేసినందునే గడప గడపకు వెళ్తున్నామని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని16వ వార్డు ఎస్‌బీఐ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కౌన్సిలర్ విజయభాస్కర్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి పథకాలకు సంబంధించిన బుక్‌లెట్‌లను అందజేశారు. వార్డులో సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సిద్ధం శివరాం, మాజీ కౌన్సిలర్ చింత శ్రీనివాస్, వాసగిరి రమేష్, వాసగిరి సుధాకర్, టైలర్ శివ, పరమేశ్వర రాజశేఖర్, శంకర్ నాయక్, ఆర్ వి సుబ్బారెడ్డి, సుధాకర్, బోయ సుబ్బరాయుడు, రామచంద్రారెడ్డి, భాస్కర్ రెడ్డి, గిరి పాల్గొన్నారు.



మహిళకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

వాటర్ ప్లాంట్ ప్రారంభం

పట్టణవాసులకు రక్షిత మంచినీటిని అందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. శనివారం 14వ వార్డు శ్రీ కృష్ణ మందిరం సమీపంలో ఉచిత శిల్పా మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభించారు. కౌన్సిలర్ విమలమ్మ, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, నాయకులు దేశం సుధాకర్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, జాకీర్ హుసేన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

పట్టణంలోని అన్ని వార్డుల అభివృద్ధే ధ్యేయమని ఎమ్మెల్యే అన్నారు. శనివారం పట్టణంలోని పలు వార్డులలో జరిగిన అభివృద్ధి పనులను ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసాతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 5, 13, 14 వ వార్డులలో రూ.60లక్షలతో పలు అభివృద్ధి పనులు చేశామన్నారు. కౌన్సిలర్లు ఆరిఫ్ నాయక్, కాల్వ సరస్వతి, ఆళ్లగడ్డ విమలమ్మ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో వసతుల కల్పన

నంద్యాల(న్యూటౌన్): డిగ్రీ కళాశాలలో వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని ఎంపీ పోచా, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.20 లక్షలతో నిర్మించిన అధునాతన మరుగుదొడ్లు, బాత్రూంలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ..హైదరాబాద్‌లోని లారస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సౌమ్య సహకారంతో ఈ పనులు చేసినట్లు తెలిపారు. ఎన్నో సంవత్సరాల నుంచి కళాశాలలో మహిళా విద్యార్థినులకు అవసరమైన మరుగుదొడ్లు, బాత్రూంలు లేకపోవటంతో ఇబ్బందులను తెలుసుకుని సంస్థ సహాయంతో పనులు చేపట్టినట్లు చెప్పారు. ప్రిన్సిపాల్ శశికళ, అధ్యాపకులు పాల్గొన్నారు.



కళాశాలలో వసతుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీ, ఎమ్మెల్యే

వైద్యశిబిరాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించండి

నంద్యాల టౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా జిల్లాలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించాలని వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీరామనాథం సూచించారు. జగనన్న సురక్ష పథకంపై శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జిల్లా వైద్యారోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. శ్రీరామనాథం మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీ సర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ నెల 30వ తేదీ వరకు ఇంటింటి సర్వేని పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం డీఎం అండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ అక్టోబర్ ఒకటి నుంచి 30వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న 369 విలేజ్ క్లినిక్స్, 16 వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఇందు కోసం 162 రకాల మందులు, 18 సర్జికల్ పరికరాలు, 14 రకాల ఎమర్జెన్సీ కిట్స్ సిద్ధం చేశామన్నారు. డాక్టర్లు జగదీష్ చంద్ర రెడ్డి, కాంతారావు నాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీరామనాథం

జీవో రద్దు చేయండి

నంద్యాల(న్యూటౌన్): పంటల బీమా పథకం అములులో ప్రైవేటు బీమా కంపెనీల భాగస్వామ్యాన్ని రద్దు చేసి జీవో నంబరు 660ని రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి కోరారు. శనివారం నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నాలుగు రోడ్ల కూడలిలో ధర్నా నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ విపత్తులతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవటానికి కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ బీమా కంపెనీలకు అప్పగించారన్నారు. కేంద్రం ఒత్తిడి వల్ల మన రాష్ట్రంలో ప్రైవేటు బీమా కంపెనీలకు అనుమతి ఇవ్వటం వల్ల రైతాంగానికి నష్ట పరిహారం రాదన్నారు. నాయకులు ఆనంద్‌బాబు, నాగమణి, రమేష్‌కుమార్, రాజశేఖర్, రామచంద్రుడు, సురేష్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

ఉయ్యాలవాడ : వినాయక చవితి పండుగ పురస్కరించుకుని మట్టి గణేష్ ప్రతిమలను వినియోగిస్తే పర్యావరణాన్ని కాపాడుకోవచ్చునని ప్రిన్సిపాల్ నూర్జహాన్ తెలిపారు. శనివారం స్థానిక మోడల్ స్కూల్‌లో మట్టి విగ్రహాలను తయారు చేసిన విద్యార్థులను అభినందిచారు.

కౌమార బాలికల్లో రక్తహీనతపై అవగాహన

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల ఐఎంఏ, మిషన్ పింక్ హెల్త్, మహిళా వైద్య విభాగం, లయన్స్‌క్లబ్ నిర్వహణలో స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలలో కౌమార బాలికల్లో రక్తహీనత, పోషకాహార విలువలపై అవగాహన సమావేశం శనివారం నిర్వహించారు. 400 మంది విద్యార్థినులకు రక్త శాతం పరీక్షలు నిర్వహించి, రక్తహీనత స్థాయిని గుర్తించారు. ఐఎంఏ మిషన్ పింక్ హెల్త్ చైర్‌పర్సన్ డాక్టరు నాగమణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైద్యులు నర్మద, మాధవి,వసుధ, సౌజన్య, ధనలక్ష్మి, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణ మాట్లాడుతూ బాలికల్లో రక్తహీనత రావటానికి కారణాలు, దానివల్ల ఉత్పన్నమయ్యే సమస్యలు, నివారణ మార్గాలు, రక్తహీనత రాకుండా ఉండటానికి అవసరమైన పోషకాహారం గురించి వివరించారు.హెచ్‌ఎం పద్మావతి, మహిళా వైద్యులు సునీత, లలిత, సరిత, తనూజ, శిల్ప, సుష్మ, అరీఫా బాను, శశికిరణ్, తేజస్విని పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ నాగమణి

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



మృతి చెందిన దూదేకుల బాషా

చాగలమర్రి: మండలంలోని నేలంపాడు గ్రామానికి చెందిన రైతు దూదేకుల బాషా (45) ఇంట్లో క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు తెలిపి వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బాషా తనకున్న రెండెకరాల పొలంతో పాటు మరో 5 ఎకరాలు కౌలుకు తీసుకొని గత ఐదేళ్లుగా జనపనార, ఉల్లి,మిరప, తదితర పంటలను సాగు చేశాడు. సాగు కలిసి రాకపోవడంతో అప్పులు అధికమయ్యాయి. తనకున్న రెండెకరాలు అమ్మి అప్పులు తీర్చాడు. అయితే మళ్లీ ఐదెకరాలు కౌలు తీసుకొని పంటల సాగు చేపట్టగా నష్ట వాటిల్లి దాదాపు రూ.5లక్షల వరకు అప్పు చేశాడు. ఈ నెల 31వ తేదీన కూమార్తె పెళ్లి ఉండటం, ఇందుకు డబ్బులు సమకూరక పోవడంతో దిక్కుతోచని పరిస్థితిలో శుక్రవారం రాత్రి ఇంట్లో క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆళ్లగడ్డకు తీసుకెళ్లగా పరిస్థితి విషమించటంతో నంద్యాలకు తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. చాగలమర్రి పోలీసులు నంద్యాలలోని వైద్యశాలకు వెళ్లి కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

లోపాలను వెలికి తీయడమే తమ విధి

శిరివెళ్ల: ఉపాధి పథకం అమలులో లోపాలను వెలికి తీయడమే తమ విధి అని ఉపాధి పథకం జిల్లా అంబుడ్స్‌పర్సన్ డాక్టర్ సురేంద్రకుమార్ తెలిపారు. శనివారం శిరివెళ్లలో సాగుచేసిన ఉద్యానవన పంటలైన మామిడి, కామినేనిపల్లె గ్రామీణ రోడ్డు ఇరువైపులా నాటిన మొక్కలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పథకంలో చాలా వరకు లోపాలు తగ్గాయన్నారు. ఏటా సామాజిక తనిఖీలతో మార్పులు వచ్చాయని చెప్పారు. ఒక కుటుంబంలో ఎంత మంది ఉన్నా ఒకే జాబ్ కార్డు ఉందని, అలాకాకుండా ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు ఇస్తే వంద రోజుల పని దినాలు వస్తాయన్నారు. ఆ దిశగా తాము ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఏపీఓ రామసుబ్బయ్య, ఈసీ సుబ్బరాయుడు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



మామిడి మొక్కలను పరిశీలిస్తున్న అంబుడ్స్‌పర్సన్

మట్టి గణపతి.. మనసా స్మరామి

- పర్యావరణ పరిరక్షణకు వాటినే వాడాలంటున్న నిపుణులు
- ఉచితంగా అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థలు
- ప్రజల్లో పెరిగిన అవగాహన

నంద్యాల(వ్యవసాయం): వినాయక చవితి.. పర్యావరణ సహిత పండుగ. స్వామి పూజలో ఉపయోగించే పత్రి, గరక, ఉత్తరేణి, చెరకు గడ, పుష్పాలు, తుమ్మి పూలు తదితరాలు ప్రకృతి సిద్ధమైనవే. అలాగే పసుపుతో లేదా మట్టితో చేసిన స్వామి వారి విగ్రహాన్ని మాత్రమే పూజించాలని పండితులు పేర్కొంటున్నారు. వీటితో పర్యావరణానికి మేలు తప్ప హాని కలుగదు. అయితే కొన్నేళ్లుగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు, రసాయన రంగులతో తయారు చేసిన వాటి వినియోగం అధికమైంది. వాటిని వివిధ జలాశయాల్లో నిమజ్జనం చేయడం కారణంగా జలరాశులతో పాటు ప్రజలు, పశువులు, పంటలకు కీడు పరిణమిస్తున్నాయి. పరిస్థితి తీవ్రం కావడంతో ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ శాఖ ప్రజలకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసి వివరిస్తుండటంతో ప్రజల్లో అవగాహన పెరిగింది. మళ్లీ మట్టి విగ్రహాల వినియోగం క్రమంగా పెరుగుతుంది. కొన్ని సేవా సంస్థలు ఉచితంగా విగ్రహాలను పంపిణీ చేస్తుండటంతో భక్తులు వీటిని తీసుకొని ఇళ్లలో నెలకొల్పడానికి ఆసక్తి చూపుతున్నారు. గతంలో తిమ్మాపురం, పెద్దకొట్టాల, తమ్మడపల్లె, రుద్రవరం, పోలూరు, టంగుటూరు గ్రామాల్లోని కుమ్మరులు విగ్రహాలను తయారు చేసి పండుగకు మూడు రోజుల ముందే విక్రయించేవారు. అయితే ఇటీవల మట్టి విగ్రహాలను ఉపయోగించాలనే భావన ప్రజల్లో అధికమైంది. దీంతో వీరు విక్రయిస్తున్న విగ్రహాలు పూర్తిగా అమ్ముడపోతున్నాయి.



లక్ష్మీగణపతి ఆలయం వద్ద మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న డీఎస్పీ మహేశ్వర రెడ్డి, కమిషనర్ రవిచంద్రారెడ్డి

మేము సైతం..

గణేష్ మహోత్సవ కేంద్ర కమిటీ, విశ్వహిందూపరిషత్, బాలాజీ కాంప్లెక్స్‌లోని కొట్టి సుబ్బమ్మ, బాలాజీ కాంప్లెక్స్ కల్యాణ మండప సభ్యులు, వాసవీ క్లబ్ సభ్యులు, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో స్టాళ్లను ఏర్పాటు చేసి దాదాపు 8వేల విగ్రహాలను ఉచితంగా విగ్రహాల పంపిణీని చేస్తారు. వీరితో పాటు మరికొన్ని సంస్థలు విగ్రహాలను పంపిణీకి ముందుకు వచ్చాయి.

విక్రయానికి విగ్రహాలు సిద్ధం..

కుమ్మరులు మట్టి విగ్రహాలను దిగుమతి చేశారు. గాంధీచౌక్, టెక్కె, నూనెపల్లె ప్రాంతాల్లో వీటిని విక్రయిస్తున్నారు. విగ్రహం పరిమాణం, ప్రత్యేకతను బట్టి రూ.100 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారు.